# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ గురువారం 20 జూన్ 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:01 సంచిక: 335

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




2లో

## నాకు పదవి కరీంనగర్ ప్రజల భిక్ష

# 21న తెలంగాణ కేబినేట్ భేటీ

### రుణమాఫీ తదితర అంశాలపై చర్చ



**హైదరాబాద్:** తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఆగస్టులో రుణమాఫీ చేయాలన్న టార్గెట్ పెట్టుకున్న ప్రభుత్వం ఆ దిశగా కార్యచరణ వేగవంతం చేసింది. ఓవైపు నిధుల సమీకరణ చేస్తూనే... మరోవైపు అర్హులను తేల్చే పనిలో పడింది. ఇప్పటికే దీనిపై అధికారులు ఓ కార్యచరణ సిద్ధం చేశారని తెలుస్తోంది. వీటిపై నిర్ణయం తీసుకునేందుకు 21 రాష్ట్ర మంత్రి మండలి సమావేశం కానుంది. 21న జరిగే తెలంగాణ మంత్రిమండలి భేటీలో ముఖ్య అంశంగా రుణమాఫీ ఉంటుందని అంటున్నారు. ఈ విషయంపై సుదీర్ఘంగా చర్చించి కీలకమైన నిర్ణయం తీసుకోనున్నారు. ఎవరెవరికి రుణమాఫీ చేయాలి, నిధుల సమీకరణకు ఏం చేయాలనే విషయంపై కూలంకుశంగా చర్చించనున్నారు. జులై17 రుణమాఫీ పక్రియ ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు వార్తలు వస్తున్నాయి. జులై నుంచే వ్యవసాయ పనులు ఊపందుకోనున్నాయని అప్పటి నుంచి రుణాలు మాఫీ చేస్తే రైతులకు మేలు జరుగుతుందని భావిస్తున్నారట. జులై మధ్యలో రుణమాఫీ పక్రియను ప్రారంభించి.. ఆగస్టు 15 కల్లా పూర్తి చేయనున్నారు. పీఎం కిసాన్ పథకంలో ఉన్న రూల్స్ ప్రకారమే మొత్తం మూడు విడతల్లో అప్పులు తీర్చేయనున్నారని టాక్. పీఎం కిసాన్ సమ్మాన్ పథకం ప్రజాప్రతినిధులు, ఐటీ కడుతున్న వాళ్లకు, ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించడం లేదు. ఇప్పుడు రుణమాఫీ కూడా వారి వచ్చే ఛాన్స్ లేదంటున్నారు.



2లో

## లోక్‌సభ

### స్పీకర్ పదవిపై తేల్చని బిజెపి

అంతర్గతంగా పార్టీలో మంత్రుల చర్చ

డిప్యూటీ కోసం పట్టుబడుతున్న ఇండి కూటమి

మోడి చర్చించిన తరవాతే అభ్యర్థిపై స్పష్టత



2లో

## జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు త్వరలోనే పాలసీ

హైదారాబాద్ సొసైటీ సభ్యులకు ఇళ్ల స్థలాలు

అక్రిడిటేషన్ కార్డుల గడువు మూడు నెలలు పొడిగింపు

రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి

### దేశంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న

# రాష్ట్రం తెలంగాణ



**దేశంలో తెలంగాణ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లోని మ్యారీగోల్డ్ హొటల్‌లో నిర్వహించిన 41వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.**

**హైదరాబాద్:** దేశంలో తెలంగాణ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లోని ఓ హొటల్‌లో నిర్వహించిన 41వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయాధారిత పరిశ్రమలు, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ పార్కుల అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అర్బన్, సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాలను క్లస్టర్లుగా విభజించి అభివృద్ధి చేస్తామన్నారు. ధాన్యం, మొక్కజొన్న పంట ఉత్పత్తులకు డిమాండ్ రాబోతుందన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు తమ మొదటి ప్రాధాన్యమని భట్టి విక్రమార్క వివరించారు.

పెద్దలకు ఒక న్యాయం.. పేదలకు మరో న్యాయమా?: మంత్రి తుమ్మల

ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంచాలని నిర్ణయించినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ప్రతి జిల్లాలో ఆయిల్ పామ్ పండిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగుకు బ్యాంకర్లు సహకరించాలని కోరారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు బ్యాంకులు రుణాలు పెంచాలని తెలిపారు. దశాబ్దాలుగా రైతే రాజు అంటున్నామని, కానీ బ్యాంకు గణాంకాలు చూస్తే భయం వేస్తోందని పేర్కొన్నారు.

బహుళజాతి, ఇన్‌ఫ్రా కంపెనీలకు రూ.వేల కోట్ల రుణాలు ఎలా ఇస్తున్నారని ప్రశ్నించారు. రైతులకు రుణాలు ఇవ్వడానికి మాత్రం బ్యాంకులు వెనకడుగు వేస్తున్నాయన్నారు. పెద్దలకు ఒక న్యాయం.. పేదలకు మరో న్యాయం ఉండకూడదని చెప్పారు. నిబంధనల ప్రకారమే బ్యాంకర్లు వ్యవహరించాలని సూచించారు.



2లో

## కేజ్రీవాల్ కస్టడీ 3 వరకు పొడిగింపు

వందకోట్లు డిమాండ్ చేసినట్లు ఆధారాలున్నాయన్న ఇడి



2లో

## డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ బాధ్యతల స్వీకరణ

ఇంద్రకీలాదరి పండితుల వేదాశీర్వచనం

### మహిళా కానిస్టేబుల్‌పై

## అత్యాచారం..



**కాళేశ్వరం:** సమాజానికి రక్షణ కల్పించాల్సిన స్థానంలో ఉండి.. తోటి ఉద్యోగినిపైనే అత్యాచారానికి ఒడిగట్టి పోలీసు శాఖ ప్రతిష్ఠకు మచ్చ తెచ్చాడో ఎస్సై. గతంలోనూ మహిళలను లైంగికంగా వేధించిన సంఘటనలు ఉండడంతో ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి.. అతడిని ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ఎస్సై భవానీ సేన్ ఓ మహిళా హెడ్ కానిస్టేబుల్‌పై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాళేశ్వరంలో లక్ష్మీ పంప్‌హౌస్ సమీపంలోని పాత పోలీస్ స్టేషన్ పరిధిలో తమకు కేటాయించిన గదుల్లో పోలీసులు నివసిస్తున్నారు. ఈ నెల 15న ఆ మహిళా హెడ్‌కానిస్టేబుల్ విధులు ముగించుకుని రాత్రి 10 గంటలకు తన గదికి వెళ్లారు. అదే భవనం రెండో అంతస్తులో నివసిస్తున్న భవానీసేన్ రాత్రి ఒంటి గంట దాటిన తర్వాత కిటీకీని తొలగించి ఆమె గదిలోకి ప్రవేశించాడు. ఆమె ప్రతిఘటించగా.. సర్వీసు రివాల్వర్‌తో బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. భయభ్రాంతులకు గురైన ఆమె.. తన భర్తతో చర్చించి మంగళవారం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో భవానీసేన్‌పై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దాదాపు 20 రోజుల కిందట కూడా కాలు జారి కింద పడిపోయానంటూ ఎస్సై ఆమెను తన గదికి పిలిపించుకుని అత్యాచారయత్నం చేయబోగా.. ఆమె తప్పించుకున్నట్లు తెలిసింది.

ఎస్సై అరెస్టు.. రిమాండ్

జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఈ ఉదంతంపై ఎస్డీపీవో సంపత్‌రావుతో విచారణ చేయించారు. ఇందుకోసం ముగ్గురు డీఎస్పీలు, ఐదుగురు సీఐలు, భారీ బందోబస్తు మధ్య విచారణ చేసినట్లు సమాచారం. ఎస్సై వద్ద ఉన్న సర్వీసు రివాల్వర్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు.. మంగళవారం రాత్రి 1.30 గంటల సమయంలో భవానీసేన్‌ను అదుపులోకి తీసుకున్నారు. బుధవారం ఉదయం భూపాలపల్లి ఫస్ట్ క్లాస్ అడిషనల్ జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపర్చారు. కోర్టు రిమాండ్ విధించడంతో అతడిని కరీంనగర్ జైలుకు తరలించారు.సర్వీసు నుంచి శాశ్వతంగా ఉద్వాసన ఎస్సై భవానీ సేన్‌ను సర్వీసు నుంచి శాశ్వతంగా తొలగిస్తూ.. మల్టీజోన్-1 ఐజీ ఏవీ రంగనాథ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

# ఇంటర్ పుస్తకాలు అందకపోవడం శోచనీయం

**హైదరాబాద్:** రాష్ట్రంలో జూనియర్ కళాశాలలు ప్రారంభమై 19 రోజులు అవుతున్నా ఇప్పటి వరకూ పాఠ్యపుస్తకాలు అందించకపోవడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు స్పందించారు. ఈ అంశంలో ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం ఉదయం ఎక్స్ వేదికగా ట్వీట్ పెట్టారు. ప్రజా పాలన అని ప్రచారం చేసుకునే ఈ ప్రభుత్వానికి విద్య మీద, విద్యార్థుల భవిష్యత్తు మీద ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనం అని అన్నారు. 422 జూనియర్ కాలేజీల్లో లక్షా 60 వేల మంది పేద, బలహీన వర్గాల విద్యార్థులు చదువుతున్నారన్నారు. వారికి నాణ్యమైన విద్య

అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాష్ట్రంలోని కొన్ని జూనియర్ కాలేజీల్లో మొదటి ఏడాది జీరో అడ్మిషన్స్ నమోదవడం పట్ల ప్రభుత్వం దృష్టి సారించి ఇంటర్మీడియట్ విద్యను బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా విద్యార్థులకు

పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయడంతో పాటు, జూనియర్ కాలేజీల్లో విధులు నిర్వర్తించే 1,654 గెస్ట్ ఫ్యాకల్టీని రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు.

కాలేజీలు తెరిచి

19 రోజులైనా శ్రద్ధ లేదు

బీఆర్ఎస్ ఎమ్మెల్యే

హరీశ్ రావు






# నాకు పదవి కరీంనగర్ ప్రజల భిక్ష

**కరీంనగర్:** తనకు కేంద్ర మంత్రి పదవి రావడం కరీంగనగర్ ప్రజలు పెట్టిన భిక్ష అని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తొలిసారి ఆయన తన సొంతగడ్డ కరీంనగర్ కు వచ్చారు. ఈ సందర్భంగా కరీంనగర్ నేలకు సాష్టంగ ప్రణామం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కార్యకర్తల కృషితోనే తాను కార్పొరేటర్ స్థాయి నుంచి కేంద్ర మంత్రి వరకు ఎదిగానని చెప్పారు. కేసీఆర్ మూర్ఖపు పాలనపై పోరాడిన వారు తనతోపాటు కొంతమంది లాఠీ దెబ్బలు తిన్నారని గుర్తు చేశారు. ప్రజాసంగ్రామ యాత్ర పేరుతో 155 రోజులు పాదయాత్ర చేసి 1600 కి.మీలు తిరిగితే.. నా అడుగులో అడుగు వేసి కార్యకర్తలు నడిచినందునే ఈ పదవి వచ్చింది. అందుకే ఈ పదవి కార్యకర్తలకే అంకితం. కార్యకర్తలు నా పక్షాన ఉండకుంటే.. లాఠీదెబ్బలు తినకుంటే, జైలుకు వెళ్లకుంటే నాకు ఈ గుర్తింపు వచ్చేది కాదన్నారు. కేంద్ర మంత్రి పదవి అధికారం కోసమో, పదవులు అనుభవించడానికో... అక్రమంగా సంపాదించుకోవడానికో కాదు.. దేశ రక్షణ, ధర్మ రక్షణ, సమాజ సంఘటితం కోసం... తెలంగాణ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయడం కోసం ఉపయోగిస్తా. రాజకీయాలకు అతీతంగా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఈ పదవిని ఉపయోగిస్తా.'అని బండి సంజయ్ అన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలు... ఎన్నికల తరువాత పూర్తిగా తెలంగాణ అభివృద్ధి, కరీంనగర్ అభివృద్ధి కోసమే పనిచేస్తానని అన్నారు. రేపు కిషన్ రెడ్డి రాష్ట్రానికి రానున్న నేపథ్యంలో ఆయనతో కలిసి బేగంపేట విమానాశ్రయం నుండి పార్టీ రాష్ట్ర కార్యాలయానికి వెళుతున్నా. సెల్యూట్ తెలంగాణ పేరుతో నిర్వహించే ఈ కార్యక్రమానికి తెలంగాణలోని ప్రతి ఒక్కరూ తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతున్నా అని బండి సంజయ్ అన్నారు.

## హర్యానాలో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ

**చండీఘడ్:**హర్యానా అసెంబ్లీకి త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. అలాంటి వేళ ఆ రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఆ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు కిరణ్ చౌదరి, ఆమె కుమార్తె శృతి చౌదరి భారతీయ బుధవారం జనతా పార్టీలో చేరారు. న్యూఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టార్.,హర్యానా సీఎం నయాబ్ సింగ్ సైనీ సమక్షంలో వారిద్దరు బీజేపీ కండువా కప్పుకున్నారు. అనంతరం వారు విలేకర్ల సమావేశంలోమాట్లాడారు. బీజేపీ విధి విధానాలు రాష్ట్రాన్ని, దేశాన్ని ముందుకు తీసుకు వెళ్తున్నాయని వారు పేర్కొన్నారు. ప్రధాని మోదీని వరుసగా ప్రజలు ఎన్నుకుంటున్నారని చెప్పారు. బీజేపీ.. ఎలా దినదినాభివృద్ధి చెందుతుందో చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం ఏమి కావాలన్నారు. బీజేపీని తాము మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. హర్యానా కాంగ్రెస్ పార్టీలో చోటు చేసుకోన్న విపరీత ధోరణలను ఈ సందర్భంగా వారు సోదాహరణగా వివరించారు. దాదాపు రెండు దశాబ్దాల క్రితం.. హర్యానా వికాస్ పార్టీకి కాంగ్రెస్ పార్టీలో విలీనం చేశామని గుర్తు చేశారు. అయితే కాంగ్రెస్ పార్టీ జెండాను వదిలి.. బీజేపీ జెండాను చేతిలోకి తీసుకోవాలంటూ ఈ సందర్భంగా తమ మద్దతుదారులకు వారు పిలుపునిచ్చారు. హర్యానాలో వరుసగా మూడోసారి బీజేపీ గెలిపించేందుకు సిద్ధం కావాలంటూ మద్దతుదారులకు కిరణ్ చౌదరి, శృతి చౌదరి సూచించారు. మరోవైపు కిరణ్ చౌదరి.. హర్యానా మాజీ సీఎం బన్సీలాల్ కోడలు. ప్రస్తుతం ఆమె బివానీ జిల్లాలోని తోషమ్ అసెంబ్లీ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఇక హర్యానా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా శృతి చౌదరి ఉన్నారు. అయితే వీరిద్దరు మంగళవారం కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన విషయం విధితమే. ఈ మేరకు రాజీనామా లేఖను ఆ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గేకు పంపారు.

## కేజ్రీవాల్ కస్టడీ 3 వరకు పొడిగింపు

**న్యూఢిల్లీ:** దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజీవ్రాల్ జ్యుడీషియల్ కస్టడీని కోర్టు జూలై 3 వరకు పొడిగించింది. మద్యం కుంభకోణంలో అరెస్టయిన కేజీవ్రాల్ రెగ్యులర్ బెయిల్ కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు విచారించింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయనను కోర్టు ముందు హాజరు పరిచారు. సీఎం అరవింద్ కేజీవ్రాల్ రూ.100 కోట్లు డిమాండ్ చేసినట్లుగా ఆధారాలు ఉన్నాయని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కోర్టుకు తెలిపింది. అరెస్టుకు ముందే ఆధారాలు సేకరించినట్లుగా పేర్కొంది. కేజీవ్రాల్ పీఎంఎల్ఏ కింద దాఖలు చేసిన ఛార్జిషీట్లలో ఆయన పేరు లేదని కేజీవ్రాల్ తరపు న్యాయవాది విక్రమ్ చౌదరి వాదించారు. సీబీఐ దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌లో సైతం కేజీవ్రాల్‌ను నిందితుడిగా పేర్కొన లేదన్నారు. కేజీవ్రాల్ కింది కోర్టులో బెయిల్ పిటిషన్ వేయవచ్చని మే 10న సుప్రీం కోర్టు ఆదేశాల్లో పేర్కొన్న విషయాన్ని ప్రస్తావించారు. ఎన్నికల సమయంలో కేజీవ్రాల్ అరెస్టు సమయం వెనుక దురుద్దేశం ఉందన్నారు.

## జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు త్వరలోనే పాలసీ

ఖమ్మం: గడిచిన పదేళ్లలో పత్రిక స్వేచ్ఛను హరించారని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జర్నలిస్టులను గత ప్రభుత్వం విపరీతంగా ఇబ్బందులు పెట్టిందని గుర్తు చేశారు. గతంలో కేసిఆర్ జర్నలిస్టులతో హిప్నాటిజం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం, రాజశేఖర్ రెడ్డి మాత్రమే జర్నలిస్టులకు మేలు చేశారని చెప్పారు. మార్పు కావాలని ప్రభుత్వాన్ని ఎన్నుకున్న మనమే అన్ని సాధించుకుంటామన్నారు. యుద్ధ ప్రాతిపదికన జర్నలిస్టులకు భూములు స్వాధీనం చేస్తామని తెలిపారు. ఖమ్మంలో జర్నలిస్టులకు రెండు మూడు రోజుల్లో క్లియర్ చేస్తామని వెల్లడించారు. హెల్త్ కార్డు సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. కొత్త ప్రభుత్వ ఏర్పాటులో జర్నలిస్టుల పాత్ర చాలా గొప్పదని అన్నారు. అమరులైన జర్నలిస్టులకు తన ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని అన్నారు. జర్నలిస్టులపై దాడుల గురించి నియంత్రణ చట్టం రూపొందిస్తా మని మంత్రి పొంగులేటి తెలిపారు. రాష్ట్రంలో పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు త్వరలోనే కొత్త పాలసీని తీసుకు వస్తామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. బుధవారం ఖమ్మంలో జరుగుతున్న టీయూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర తృతీయ మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల కీలక పాత్రను పోషించారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పడికట్టు పదాలతో సమస్యలు తీరుస్తామంటూ హామీలు ఇచ్చారే గాని ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేదని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజా పాలన రావడానికి జర్నలిస్టులు కృషి చేశారని గుర్తు చేశారు. రాష్ట్ర రాజధాని హైదరాబాదులో గతంలో జర్నలిస్టులకు ఇచ్చిన స్థలాలకు సంబంధించి కోర్టులో కేసు వల్ల ఆగిపోయాయని, ఏడాది క్రితమే ఆ కేసు క్లియర్ అయినా కూడా గత ప్రభుత్వం ఇప్పటివరకు వారికి ఇళ్లస్థలాలను ఇవ్వలేదని విమర్శించారు. త్వరలోనే ఆ స్థలాలను హైదరాబాద్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ సభ్యులకు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, వారం, పది రోజుల్లోనే దానికి సంబంధించిన జీవో విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని ప్రకటించారు. అలాగే హైదరాబాద్లో మిగిలిపోయిన మిగతా జర్నలిస్టులకు, జిల్లాలు, మండలాల్లో పనిచేసే వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు త్వరలోనే ఒక పాలసీని తీసుక వస్తున్నామని చెప్పారు. గతంలో ఖమ్మంలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలకు సంబంధించి ఇచ్చిన జీవో ఆగిపోయిందని తెలిపారు. మరొక స్థలాన్ని చూడాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించామని ఆ పక్రియ వారం రోజుల్లో పూర్తవుతుందని ప్రకటించారు. అక్రిడిటేషన్ల గడువు ఈ నెలాఖరు తో ముగుస్తున్నదని, మరో మూడు మాసాల పాటు గడువు పెంచుతున్నామని దీనికి సంబంధించిన ఉత్తర్వులు ఒకటి వెలువడనున్నాయని మంత్రి పేర్కొన్నారు. వందకు వంద శాతం జర్నలిస్టులకు ఈ ప్రభుత్వం అండగా ఉంటుందని, హెల్త్ కార్డులకు సంబంధించి, వివిధ రాష్టాల్లో ఉన్న పాలసీలను అధ్యయనం చేసి దానికి అనుగుణంగా జర్నలిస్టులకు వైద్యాన్ని అందిస్తామని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, రక్షణ కోసం ఉన్నటువంటి అన్ని రకాల కమిటీలను త్వరలోనే పునరుద్ధ రిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్

అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్ రెడ్డి, ఐజేయు మాజీ అధ్యక్షులు దేవులపల్లి అమర్, టియుడబ్ల్యూజే (ఐజెయు) రాష్ట్ర అధ్యక్షులు నగునూరి శేఖర్, ప్రధాన కార్యదర్శి విరహత్ అలీ, ఐజేయూ ప్రతినిధులు నరేందర్ రెడ్డి, కే సత్యనారాయణ, వివిధ జిల్లాల నుంచి వచ్చిన జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు, జాతీయ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కార్యవర్గం తదితరులు పాల్గొన్నారు.

# లోక్‌సభ స్పీకర్ పదవిపై తేల్చని బిజెపి

**న్యూఢిల్లీ:** లోక్‌సభ స్పీకర్ సీటుపై సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. ఈ సారి ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మేజిక్ ఫిగర్ సీట్లు బీజేపీకి సొంతంగా రాకపోవడంతో? లోక్‌సభ అధ్యక్ష పదవిపై రాజకీయం నడుస్తోంది.సార్వత్రిక ఎన్నికల్లో లోక్‌సభలో బలం పెంచుకున్న విపక్ష పార్టీలు.. ఈసారి స్పీకర్ ఎన్నికపై కన్నేశాయి. తమకు డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వాలన్న డిమాండ్‌ను తెరపైకి తెస్తున్నాయి. ఒకవేళ అలా ఇవ్వకుంటే, స్పీకర్ ఎన్నిక నిర్వహించాలనే డిమాండ్‌ను గట్టిగా వినిపిస్తున్నాయి. దీంతో దశాబ్దాలుగా ఏకాభిప్రాయంతోనే జరుగుతున్న లోక్‌సభ స్పీకర్ ఎన్నిక సంప్రదాయానికి తెర పడుతుందా? అన్న చర్చ ఊపందుకుంది. ఇక ఈ నేపథ్యంలోనే ఎన్డీయే కూటమి నేతలు భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించిన భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి, ముచ్చటగా మూడోసారి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. హ్యాట్రిక్ విజయం సాధించిన నరేంద్ర మోదీ.. మూడోసారి భారతదేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. ఆయనతో పాటు 72 మంది కేంద్రమంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కేంద్ర మంత్రులకు శాఖల కేటాయింపు సైతం పూర్తి అయ్యింది. దీంతో ఇప్పుడు లోక్‌సభ స్పీకర్ పదవిపై దేశ రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. లోక్‌సభ అధ్యక్ష పదవి ఏ పార్టీకి చెందిన వ్యక్తికి దక్కుతుందోనన్న ఆసక్తి అందరిలోనూ నెలకొంది.స్పీకర్, డిప్యూటీ స్పీకర్ విషయంలో ఎన్డీయే



పక్షాలతో పాటు విపక్షాల్లోనూ ఏకాభిప్రాయం సాధించేలా ఎలా కసరత్తు సాగించాలనే దానిపై మంత్రులు చర్చించారు. అలాగే డిప్యూటీ స్పీకర్ కావాలంటున్న విపక్షకూటమి డిమాండ్‌ను ప్రధాని మోదీకే వదిలేశారు. మోదీతో చర్చించిన తరవాతనే స్పీకర్, డిప్యూటీ స్పీకర్

ఎవరన్నదానిపై క్లారిటీకి రానున్నట్లుగా తెలుస్తోంది. ఇక లోక్‌సభ స్పీకర్ ఎన్నిక విషయంలో ఏకాభిప్రాయం కోసం ఎన్‌డిఎ గట్టిగానే ప్రయత్నిస్తోంది. విపక్షాలను ఒకతాటిపైకి తెచ్చి తాము అనుకున్న వ్యక్తికే అధ్యక్ష పదవి ఇవ్వాలని ప్రయత్నం చేస్తోంది. మరోవైపు ఎన్డీఏ కూటమిలో కీ రోల్ ప్లే చేస్తున్న టీడీపీ, జేడీయూ పార్టీలు స్పీకర్ పదవిని ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. కేంద్ర కేబినెట్‌లో కూడా కీలకమైన హోంశాఖ, రక్షణ, ఆర్థిక, విదేశీ వంటి శాఖలన్నీ బీజేపీ తమ వద్దే ఉంచుకుంది. దీంతో స్పీకర్ పదవి ఎట్టి పరిస్థితుల్లో తమకు ఇవ్వాలని టీడీపీ, జేడీయూ కోరుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈసారి ఇండియా కూటమి బలంగా ఉండటం, సభ వ్యవహారాలు నడపటం కీలకంగా మారడంతో? స్పీకర్ పదవిని బీజేపీకి చెందిన వ్యక్తికే ఇవ్వాలని కాషాయ పార్టీ హై కమాండ్ భావిస్తున్నట్లుగా జోరుగా ప్రచారం జరుగుతోంది.

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా వారసులుగా బీజేపీ నేతలు ఆంధ్రప్రదేశ్‌కు దగ్గుబాటి పురందేశ్వరి పేరు బలంగా వినిపిస్తోంది. ఆమెతోపాటు ఒడిశా నుంచి బీజేపీలో చేరిన కటక్ ఎంపీ ఎంపీ భర్తృహరి మహతాబ్, రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధరా రాజే పేర్లు ప్రముఖంగా వినిపిస్తుండగా.. ఓం బిర్లానే మరోసారి లోక్‌సభ స్పీకర్‌గా నియమించే అవకాశం ఉందంటూ జాతీయ మీడియా కథనాలు వెలుగులోకి వచ్చాయి. ఇక రాజ్యాంగ నిబంధనలు ప్రకారం కొత్త లోక్‌సభ మొదటి సారి సమావేశానికి ముందు స్పీకర్ పదవి ఖాళీ అవుతుంది. కొత్త ఎంపీలతో ప్రమాణస్వీకారం చేయించడానికి సభలోని సీనియర్ సభ్యుడిని ప్రొటెం స్పీకర్‌గా రాష్ట్రపతి నియమిస్తారు. ప్రొటెం స్పీకర్ రేసులో కాంగ్రెస్ సీనియర్ నేత కొడికున్నిల్ సురేశ్ పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. ఎనిమిది సార్లు లోక్‌సభ సభ్యునిగా ఎన్నికైన సురేష్ పార్లమెంటరీ అనుభవం పరంగా అత్యంత సీనియర్ కావడం కలిసివచ్చే అంశం. మొత్తంగా ఎన్నికలో 233 స్థానాల్లో గెలుపొందిన విపక్ష ఇండియా కూటమి.. డిప్యూటీ స్పీకర్ పదవి విషయంలో తగ్గేదేలే అంటోంది. లేదంటే స్పీకర్ ఎన్నిక జరగాల్సిందేనన్న డిమాండ్ వినిపిస్తోంది.

# సింగరేణి ప్రైవేటీకరణ ఉండదు

**అది కేసీఆర్ చేసిన విషప్రచారం..**

**గనులు కావాలంటే ఎవరైనా వేలంలో పాల్గొనాల్సిందే**

**బయ్యారం ఉక్కు కర్మాగారం సాధ్యం కాదు**

**ఫోన్ ట్యాపింగ్ దర్యాప్తు సీబీఐకి అప్పగించాలి**

**కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

**ఢిల్లీ:** సింగరేణి ప్రైవేటీకరణ అనే ప్రశ్నే ఉత్పన్నం కాదని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. 2018 ఎన్నికల్లో లబ్ధి పొందడానికి కేసీఆర్ సింగరేణి ప్రైవేటీకరణ అంటూ విషప్రచారంచేశారు తప్ప, అందులో నిజం లేదన్నారు. దిల్లీలోని తన కార్యాలయంలో ఆయన బుధవారం వివిధ అంశాలపై మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. దేశంలోని ఏ ప్రభుత్వరంగ బొగ్గు సంస్థనూ తాము ప్రైవేటీకరణ చేయబోమన్నారు.



"బొగ్గు గనులను వేలం ద్వారానే కేటాయించాలని, నామినేషన్ పద్ధతిలో ఇవ్వడానికి వీల్లేదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. దానివల్లే కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు తొమ్మిది రౌండ్ల వేలం నిర్వహించి.. 300 గనులను వేలం వేసింది. ఈ నెల 21న పదో రౌండ్ వేలం హైదరాబాద్‌లో ప్రారంభం కాబోతోంది. దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వాలకే ఆదాయం వస్తుంది. బొగ్గు, గనుల వేలం కారణంగా ఒడిశా ప్రభుత్వానికి ఏటా రూ.36 వేల కోట్ల ఆదాయం వస్తోంది. ఈసారి వేలంలో పాల్గొననున్న సింగరేణిబొగ్గు గనులను తనకు ఇష్టం వచ్చిన వారికి ఇచ్చుకోవడానికే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వేలాన్ని వ్యతిరేకించారు. అందుకే వేలంలో పాల్గొనవద్దని సింగరేణిని ఆదేశించారు. అయితే ఈసారి సింగరేణి ద్వారా వేలంలో పాల్గొంటామని తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మా శాఖ పూర్వ మంత్రి ప్రహ్లాద్‌జోషీకి చెప్పారు. దానివల్ల రాష్ట్ర ఖజానాకు ఆదాయం వస్తుంది. సింగరేణికి సాయం విషయంలో కేంద్రం నిర్లక్ష్యం చేయబోదు. ఆ సంస్థలో రాష్ట్ర ప్రభుత్వానికి 51%, కేంద్రానికి 49% వాటా ఉంది కనుక.. రోజువారీ పరిపాలనాధికారాలన్నీ తెలంగాణ ప్రభుత్వం చేతుల్లోనే ఉంటాయి. ఎండీని వాళ్లే నియమిస్తారు.

# రుషికొండపై నిర్మాణాల్లో తప్పేముంది

**చిత్తూరు:** వైసీపీ హయాంలో రుషికొండలో నిర్మించిన భవనాలపై వివాదం రోజురోజుకూ ముదురుతోంది. ఈ అంశంపై ఇప్పటికే అధికార టీడీపీ, వైసీపీ నేతల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. ప్రభుత్వ సొమ్ముతో రుషికొండపైవిలాసవంతమైన భవనాలు నిర్మించారంటూ టీడీపీ ట్విట్టర్ వేదికగా విమర్శలు గుప్పిస్తోంది. వైసీపీ నేతలు సైతం దీనికి కౌంటర్ ఇస్తున్నారు. తాజాగా, మాజీ మంత్రి ఆర్కే రోజా ఈ అంశంపై స్పందించారు. రుషికొండలో పర్యాటక శాఖ భవనాలను నిర్మించడం తప్పా అని ఆమె ప్రశ్నించారు. 'విశాఖ నగరాన్ని విశ్వనగరంగా అభివృద్ధి చేయాలని కంకణం కట్టుకున్న మా ప్రభుత్వంలో అంతర్జాతీయ ప్రమాణాలతో భవనం నిర్మించడం తప్పా.. వర్షానికి కారిపోయే అసెంబ్లీని, సచివాలయాన్ని కట్టిన వాళ్లకు అత్యంత నాణ్యతతో రుషికొండలో భవనాలు నిర్మించడం చూసి ఓర్వలేకపోవడం



**పర్యాటకంగా అభివృద్ధి కోసమే నిర్మించాం**

**దీనిపై ఇంతగా యాగీ చేయాల్సిన పనిలేదు**

**ట్విట్టర్ వేదికగా మాజీమంత్రి రోజా వ్యాఖ్యలు**

**ఘాటుగా స్పందించిన నగరి ఎమ్మెల్యే**

సమంజసమేనని అన్నారు. 2021లోనే కేంద్ర అటవీ, పర్యావరణ శాఖకు సమగ్ర వివరాలిచ్చి రుషికొండ నిర్మాణాలు చేపట్టిన మాట వాస్తవం కాదా.. 61 ఎకరాల్లో 9.88 ఎకరాల్లోనే ఈ నిర్మాణాలు చేపట్టాం... ఇందులో అక్రమం ఎక్కడుంది..? విశాఖ ఖ్యాతిని ఇనుమడించేలా, రాష్ట్రానికి తలమానికంగా భవనాలు నిర్మించడం కూడా నేరమేనా..? ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేలా ఫైవ్ స్టార్ వసతులతో నిర్మాణాలు చేయడం తప్పేనా...?' అని నిలదీశారు. 'ఏడు బ్లాకుల్లో ఏమేమి నిర్మాణాలు, వసతులు ఉంటాయో గతంలోనే టెండర్ డాక్యుమెంట్లలో పొందుపర్చిన మాట వాస్తవం కాదా...? హైకోర్టుకు ఈ నిర్మాణాలపై ప్రతి దశలోనూ అధికారులు నివేదిక సమర్పించిన వాస్తవం దాచేస్తే దాగుతుందా..? ఇన్నాళ్లు ఇవి జగనన్న సొంత భవనాలని ప్రచారం చేసిన వాళ్లు ఇప్పటికైనా అవి ప్రభుత్వ భవనాలని అంగీకరిస్తారా..? లేదా..? హైదరాబాద్‌లో సొంతిల్లు కట్టుకున్నారని, హయత్ హోటల్‌లో లక్షలకు లక్షలు ప్రజల డబ్బులను అద్దెలు చెల్లించిన వాళ్లా... ఈ రోజు విమర్శలు చేసేది..? లేక్ వ్యూ గెస్ట్ హౌస్, పాత సచివాలయం ఎల్ బ్లాక్, హెచ్ బ్లాక్‌లలో రూ.40 కోట్లతో హంగులు అద్ది రాత్రికి రాత్రి వాటిని వదిలేసి విజయవాడ వచ్చేసిన వాళ్లా

ఈరోజు విమర్శలు చేసేది..?' అని రోజా ప్రశ్నల వర్షం కురిపించారు. వైసీపీ అధినేత మా జగనన్నపై, మాపై ఎంత వ్యక్తిత్వ హననం చేసినా రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై పోరాటంలో వెన్ను చూపేది లేదు... వెనకడుగు వేసేది లేదు' అని స్పష్టం చేశారు.అయితే, ఈ ట్వీట్‌పై నగరి టీడీపీ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ రెడ్డి ట్విట్టర్ వేదికగానే కౌంటర్ ఇచ్చారు. 'నవ్విపోదురు గాక నా కేటి సిగ్గు అన్నట్లుంది మీ యవ్వారం... ముందు ఆ ప్యాలెస్‌కు.. మీ బెంజ్ కారుకు ఉన్న సంబంధం ఏంటో బయట పెట్టండి మాజీ మంత్రి గారూ.' అంటూ ట్వీట్‌లో పేర్కొన్నారు.

## దశలవారీగా రుణమాఫీ?

హైదరాబాద్:వచ్చే నెల మొదటి వారం నుంచి రైతు రుణమాఫీని దశలవారీగా అమలు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అమలుకు కసరత్తు చేస్తున్న ప్రభుత్వం ఇప్పటికే మార్గదర్శకాలు, నిధుల సమీకరణ తదితర అంశాలపై ఓ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఆగస్టు 15 కల్లా రుణమాఫీని అమలు చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గత కొన్ని రోజులుగా ఆర్థిక శాఖ అధికారులతోనూ, మంత్రివర్గ సహచరులతోనూ దీనిపై విస్తృతంగా చర్చించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కేంద్రం కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి రూపొందించిన మార్గదర్శకాలను కూడా అధ్యయనం చేసిన ప్రభుత్వం, రుణమాఫీ అమలులో కేంద్ర మార్గదర్శకాలను

పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది. దీని ప్రకారం.. సంస్థలకు ఉన్న భూములకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారికి, ప్రస్తుత, మాజీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్లు, జిల్లా పరిషత్ ఛైర్మన్లు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్నత కేటగిరీల్లోని ఉద్యోగులు, డాక్టర్లు, ఇంజినీర్లు, లాయర్లు, చార్టర్డ్ ఎకౌంటెంట్లు.. ఇలా పలు రంగాలకు చెందిన వారు భూములపై తీసుకొన్న రుణానికి మాఫీ ఉండదు.



# డీవీకే వర్ధంతి సభ కరపత్రాల ఆవిష్కరణ.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జూన్ 19:**



విప్లవోద్యమ నేత ప్రజాపంథ రాష్ట్ర కార్యదర్శి డివి కృష్ణ 2వ వర్ధంతి సభ కరపత్రాలను బుధవారం సీపీఐ(ఎం.ఎల్) ప్రజాపంథా డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కోటగల్లీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి ఎం. వెంకన్న మాట్లాడుతూ, డీవీకే అలుపెరగని యోధుడని, ఎన్నో రాజకీయ దాడులను భీకరంగా ఎదుర్కొన్నారని తెలిపారు. తను నమ్మిన విధానాలపై, సిద్ధాంతంపై నిలబడ్డారన్నారు. మితవాదత్వంలోనికి పార్టీని దిగజార్చినా, దానినుంచి బయట పడటానికి ఓపిగ్గా కృషి చేశారన్నారు. అత్యంత నిజాయితీగా, ఆదర్శవంతంగా జీవితంలో రాజకీయాలలో విలువైన కమ్యూనిస్టు విప్లవకారునిగా నిలిచిన వ్యక్తి డీవీకే అని అన్నారు. ఈనెల 26న జిల్లా కేంద్రంలో పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగే డీవీకే 2వ వర్ధంతి సభను జయప్రదం చేయాలని విప్లవ అభిమానులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) డివిజన్ సహాయ కార్యదర్శి సాయగౌడ్, నగర కార్యదర్శి ఎం.సుధాకర్, జిల్లా నాయకులు బి.కిషన్, డిచ్ పల్లి మండల కార్యదర్శి బి.మురళి, మోపాల్ మండల కార్యదర్శి డి. గంగమల్లు, పిఓడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కే. సంధ్యారాణి, పిడిఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేశ్, డివిజన్ నాయకులు గంగారం, భాస్కర స్వామి, గంగాధర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు విద్యాసంస్థల్లో దోపిడీని అరికట్టాలి.

## విద్యా, వైద్యంకు బడ్జెట్ లో పెద్దపీట వేయాలి.

## బిఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ డిమాండ్.



**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్, జూన్ 19:**

ప్రభుత్వ రంగంలోని విద్య, వైద్యం అభివృద్ధి కోసం తగిన నిధులు విడుదల చేయాలని, ప్రభుత్వ హాస్పిటల్స్, స్కూల్స్ లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని నల్ల సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలు, కార్పొరేట్ వైద్యసంస్థల అదిక ఫీజుల దోపిడిని నియంత్రించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బిఎల్ఎఫ్ రాష్ట్ర కమిటి సమావేశం డిమాండ్ చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కబ్జాలకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోని భూమి లేని నిరుపేదలకు పంపిణీ చేయాలని బిఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు.

హైదరాబాద్, నల్లకుంటలోగల బహుజన లెఫ్ట్ పార్టీ( బిఎల్పీ) రాష్ట్ర కార్యాలయంలో బుధవారం జరిగిన బిఎల్ఎఫ్ రాష్ట్ర కమిటి సమావేశంలో నల్లా సూర్యప్రకాష్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో చేసిన వాగ్దానం ప్రకారం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కబ్జాలకు గురైన భూములను స్వాధీనం చేసుకోని పేదలకు పంపిణీ చేయాలని, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది పేదలు నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించాలని డిమాండ్ చేశారు.జూన్ 30 వరకు స్థానిక సంస్థల ఎన్నికలు బీసీ రిజర్వేషన్ అనే అంశం మీద జిల్లాలలో రౌండ్ టేబుల్ సమావేశాలు ఇంకా కొనసాగించాలని, అలాగే జూలై 4న దొడ్డి కొమరయ్య వర్ధంతి భూ సమస్యపై సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు నిర్వహించాలని సమావేశం నిర్ణయించినట్లు తెలియజేశారు. ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, బహుజన లెఫ్ట్ పార్టీ (బిఎల్పీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఐదు గ్యారంటీల అమలు పై దృష్టి కేంద్రీకరించాలని, రాష్ట్రంలో బిజెపి విస్తరణను అడ్డుకోవడానికి కుల జనగణన జరపడం ద్వారా సామాజిక న్యాయాన్ని అందించాలని సూచించారు. ఈకార్యక్రమంలో బహుజన కమ్యూనిస్టు పార్టీ(బిసిపి) రాష్ట్ర కార్యదర్శి కె. పర్వతాలు. ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు నూనె వెంకటస్వామి, వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అద్యక్షులు పాండురంగ చారి, బిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ వనం సుధాకర్, రాష్ట్ర నాయకులు ఎస్.సిద్ధిరాములు, మాస్ సావిత్రి, మారోజు సునీల్ కుమార్, ఎం. జంగయ్యలు పాల్గొన్నారు.

# వారం రోజుల్లో "అమ్మ ఆదర్శ" పనులు పూర్తి చేయాలి.

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశాలు.**



**వేగుచుక్క న్యూస్,కామారెడ్డి, జూన్ 19:**

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు వారం రోజుల వ్యవధిలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పురోగతి, దుస్తుల పంపిణీపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేసి వారం రోజుల వ్యవధిలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పూర్తయ్యే విధంగా చూడాలని తెలిపారు. డివిజన్ల వారీగా అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సహకరించకపోతే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈనెల 28 లోగా పనులు పూర్తి చేయకపోతే సంబంధిత ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. కుట్టిన దుస్తులు వివరాలు డి ఆర్ డి ఓ, విద్యాశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. దుస్తులు కుట్టే పనులు త్వరితగతిన పూర్తయ్యే విధంగా చూడాలని కోరారు. సమీక్ష సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డిఆర్డిఓ చందర్, డీఈవో రాజు, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా అధికారులతో ప్రభుత్వ సలహాదారు భేటీ.



**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, జూన్ 19 :**

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ బుధవారం నిజామాబాద్ జిల్లా అధికారులతో భేటీ అయ్యారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జరిగిన ఈ భేటీ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి పలు అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. ప్రధానంగా జిల్లాలోని ఆయా మున్సిపల్ పట్టణాలలో తాగునీటి సరఫరా, భూగర్భ డ్రైనేజీ తీరుతెన్నుల గురించి అడిగి తెలుసుకున్నారు. అమృత్ పథకం కింద చేపట్టాల్సి ఉన్న మంచి నీటి సరఫరా, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు సంబంధించి కొంత ప్రతిష్టంభన నెలకొని ఉందని ప్రజారోగ్య శాఖ ఈ.ఈ తిరుపతి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ దృష్టికి తేగా, ఆయన తక్షణమే స్పందించారు. అప్పటికప్పుడే ఫోన్లో సంబంధిత శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ ను సంప్రదించి, ప్రతిష్టంభన తొలగిపోయేలా చొరవ చూపారు. అమృత్ పథకం పనులకు ప్రభుత్వం నుండి అన్ని అనుమతులు మంజూరు చేస్తామని ప్రిన్సిపల్ సెక్రటరీ తెలిపారు. దీంతో మున్సిపల్ పట్టణాల్లో తాగునీరు, యూజీడీ వ్యవస్థను మెరుగుపరిచే పనులు త్వరలోనే ప్రారంభం అయ్యేందుకు ఆస్కారం ఏర్పడింది. ఇతర పలు అంశాలపై కూడా చర్చించిన ప్రభుత్వ సలహాదారు, అధికారులకు కీలక సూచనలు చేశారు. ఈ భేటీలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అవినీతి లేకుండా ఆర్మూర్ అభివృద్ధి.

**- ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి.**

**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్, జూన్ 19:**



అవినీతి, కమీషన్లు లేకుండా ఆర్మూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి అన్నారు. ఎమ్మె ల్యే కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో రాకేశ్ రెడ్డి మాట్లాడారు. ఆర్మూర్ ప్రాంత అభివృద్ధి కోసం సీఎంతో పాటు పలువురు మంత్రులను కలిసి చర్చించానని అన్నారు. నిధులు మంజూరు చేస్తామని వారు హామీ ఇచ్చారని, ప్రణాళికలు కూడా రూపొందిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నందిపేట్ లో ఆర్అండ్ బీ గెస్ట్ హౌస్, మాక్లూర్ లో మహిళా కళాశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయన్నారు. నియోజవర్గంలోని గుంజిలి, కంఠం, మచ్చర్ల, ఫతేపూర్ లిఫ్ట ఏర్పాటు త్వరలో జరగనుందని పేర్కొన్నారు. ఆర్మూర్ రైల్వే జంక్షన్ ను డిచ్ పల్లి వరకు కలపాలని రైల్వే మంత్రిని కోరానని, సర్వే కోసం చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే జక్రాన్పల్లిలో ఎయిర్ ఫోర్టు ఏర్పాటు విషయమై కేంద్ర మంత్రిని కలిసినట్లు చెప్పారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కంచెట్టి గంగాధర్, పట్టణాధ్యక్షుడు ద్యాగ ఉదయ్, జిల్లా అధికార ప్రతినిధి కలికోట గంగాధర్, పాన్ శ్రీనివాస్, ఆకుల రాజు, జాగిర్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల రాత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు.

**అభ్యర్థులు వెబ్సైట్ ద్వారా హాల్ టిక్కెట్లు డౌన్లోడ్ చేసుకోవాలి.**

**కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, జూన్ 19**

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా జూన్ 24 నుండి 29వ తేదీ వరకు జరుగనున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల వెల్ఫేర్ ఆఫీసర్ల నియామక రాత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. పరీక్ష ప్రారంభమయ్యే మూడు రోజుల ముందు నుండి కమిషన్ వెబ్సైట్ ద్వారా హాల్ టిక్కెట్లను డౌన్లోడ్ చేసుకోవచ్చని అభ్యర్థులకు సూచించారు. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు కొనసాగుతాయన్నారు.

పరీక్షల సందర్భంగా పాటించాల్సిన నిబంధనల గురించి అభ్యర్థులు పూర్తి అవగాహన ఏర్పరుచుకోవాలని సూచించారు. బయో మెట్రిక్ విధానం ద్వారా వేలిముద్రల సేకరణ ప్రక్రియ చేపట్టాల్సి ఉన్నందున అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. మార్నింగ్ సెషన్ కు సంబంధించి ఉదయం 8.30 గంటల నుండి అభ్యర్థులను పరీక్షా కేంద్రం లోనికి అనుమతిస్తారని, 9.30 గంటలకు పరీక్షా కేంద్రం గేట్లు మూసివేస్తారని కలెక్టర్ స్పష్టం చేశారు. మధ్యాహ్నం సెషన్ పరీక్షకు ఒంటి గంట నుండి కేంద్రం లోనికి అనుమతిస్తారని, మధ్యాహ్నం 2.00 గంటలకు గేట్లు మూసివేస్తారని అన్నారు. గేట్లు మూసివేసిన తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ అభ్యర్థులను అనుమతించడం ఉండదని స్పష్టం చేశారు. అభ్యర్థులు కాలిక్యులేటర్లు, పేజర్లు, సెల్ ఫోన్లు, టాబ్లెట్లు, పెన్ డ్రైవ్లు, బ్లూటూత్ పరికరాలు, వాచ్, మ్యాథమేటికల్ టేబుల్లు, లాగ్ బుక్లు, లాగ్ టేబుల్లు, వాలెట్, హ్యాండ్బ్యాగులు, పౌచ్లు, రైటింగ్ ప్యాడ్లు, నోట్స్, లూజ్ షీట్లు వంటివి తీసుకురాకూడదని, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, రికార్డింగ్ సాధనాలు అనుమతించబడవని కలెక్టర్ స్పష్టం చేశారు. అభ్యర్థులు షూస్ కాకుండా చెప్పులు ధరించి రావాలని సూచించారు. అభ్యర్థులు తమ వేళ్లపై బయోమెట్రిక్స్ రికార్డింగ్కు ఆటంకం కలిగించే మెహెందీ, తాత్కాలిక టాటూలు లేదా ఏదైనా అబ్స్ట్రక్టివ్ మెటీరియల్ కవర్లు కలిగి ఉండకూడదని సూచించారు. హాల్ టికెట్ లో పొందుపర్చబడిన పరీక్షా కేంద్రాన్ని అభ్యర్థులు ముందుగానే వెళ్లి పరిశీలించుకుంటే పరీక్ష రోజున గందరగోళానికి గురయ్యే పరిస్థితి ఉండదని హితవు పలికారు. పరీక్షకు హాజరయ్యే ముందు రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ వెబ్సైట్లో అందుబాటులో ఉంచిన మాక్ టెస్టును అభ్యర్థులు క్షుణ్ణంగా ప్రాక్టీస్ చేయాలని సూచించారు. విలువైన వస్తువులు వెంట తెచ్చుకోవద్దని తెలిపారు.

# ఏ హోదాలో ఉన్నత అధికారులతో షబ్బీర్ సమీక్షా జరిపారు.

**- అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ ఆగ్రహం.**




**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జూన్ 19:**

ఏ హొదాలో ఉన్నత అధికారులతో షబ్బీర్ అలీ సమీక్షా జరిపారో తెలుపాలని అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా ఓడి పోయినా వ్యక్తి సమీక్ష జరపడం సహించరానిధని అన్నారు. బీజేపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓడిపోయిన ఎమ్మెల్యే అభ్యర్థివా.. జిల్లా మంత్రి అనుకుంటున్నావా, అధికారం ఉందనే అహంకారామా అని దన్ పాల్ మండిపడ్డారు. సొంత జిల్లా కామారెడ్డి లో చెల్లని రూపాయ ఇక్కడ చెల్లుతుందని టికెట్ ఇస్తే ఇక్కడి ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టింది సరిపోలేదా అని అన్నారు. షబ్బీర్ అలీకి ఇందూర్ అర్బన్ ప్రజల పైన నిజమైన ప్రేమ ఉంటే అర్బన్ లో అనేక సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారానికి ముందుకు రావాలన్నారు. పేదోనికి ఉండటానికి ఇల్లు కూడా లేదు, కట్టిన డబుల్ బెడ్ రూమ్స్ వృధాగా పడి ఉన్నాయి, కొత్త రేషన్ కార్డులు లేవని, పెన్షన్ లేవని, రోడ్స్, డ్రైనేజ్ సరిగా లేవని, ఇచ్చిన గ్యారంటీలు దరఖాస్తులకే పరిమితం అయ్యాయని దమ్ముంటే వందరోజుల్లో అమలు చేస్తా అన్న ఆరు గ్యారంటీలు అమలుచెయాలన్నారు. కొద్ది రోజుల క్రితమే అర్బన్ సమస్యల పైన సచివాలయంలో సంబంధిత మంత్రులకు వినతిపత్రాలు ఇవ్వడం జరిగిందని, వాటికి ఎటువంటి చర్యలులేవని, కాంగ్రెస్ వాళ్ళు అడ్డగోలు కమీషన్లు వసులు చేయడానికి, భూ కబ్జాలు చేయడానికి, అధికారులను భయభ్రాంతులకు చేయడానికి పని చేస్తున్నారని అన్నారు. ఇక్కడ గెలిచిన ఎమ్మెల్యే తాను ఉండగా ఓడిపోయిన వారికి అధికారులు గులాం చేస్తా అంటే ఊరుకోను అని హెచ్చరించారు. నగరం చాలా ప్రశాంతంగా ఉంది, ఓ వర్గానికి కొమ్ముకాస్తూ, మరో భైన్సా చేస్తా అంటే చూస్తూ ఊరుకోము అని అన్నారు. ఈ కార్యక్రమంలోబిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు నాగోల్ల లక్ష్మీనారాయణ, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నాలం రాజు, కార్పొరేటర్లు మాస్టర్ శంకర్, సాదు సాయి వర్ధన్, సుంకరి నారాయణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.




# తంగలాన్ విక్రమ్ లుక్ ఔట్



చియాన్ విక్రమ్ తాజాగా నటిస్తున్న చిత్రం 'తంగలాన్' కోలార్ గోల్డ్ ఫ్యాక్టరీ పని చేసిన తమిళ కూలీల ఇతివృత్తంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు దర్శకుడు పా.రంజిత్. మాళవిక మోహనన్ , పార్వతీ తిరువోతు హీరోయిన్లు. ప్రతి నాయకుడిగా పశుపతి నటించారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించిన ఈ చిత్రాన్ని ఈ యేడాది జనవరి 26వ తేదీ గణతంత్ర దినోత్సవం సందర్భంగా రిలీజ్ చేయనున్నట్టు ప్రకటించారు. అయితే, పోస్ట్ ప్రొడక్షన్, గ్రాఫిక్స్ పనులు పూర్తి కాకపోవడంతో చిత్రం విడుదలను వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో తాజాగా ఈ మూవీ నుంచి విక్రమ్ కొత్త లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేయగా అది వైరల్‌గా మారింది. లుక్‌లో విక్రమ్‌ని చాలా క్లోజ్‌గా చూపించారు. కళ్లలో కళ్లు పెట్టి తీక్షణంగా చూస్తున్నట్లుగా ఉన్న ఈ పిక్.. విక్రమ్‌లోని విలక్షణతని మరోసారి తెలియజేస్తోంది. స్టూడియో గ్రీన్ పతాకంపై నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో భారీ బ్జడెట్‌తో ఈ సినిమా నిర్మిస్తున్నారు. కాగా, ఈ మూవీని ఇప్పటికే పలు అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో ప్రదర్శించగా అనేక అవార్డులు, రివార్డులు వరించడం విశేషం. మూవీ క్రిటిక్స్ నుంచి సైతం ఈ సినిమాకు ప్రశంసలు దక్కుతున్నాయి. ఆగస్టులో విడుదలయ్యే ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల ఈ చిత్ర గ్లింప్స్ రిలీజ్ సందర్భంగా దర్శకుడు పా. రంజిత్ మాట్లాడుతూ.. 'తంగలాన్' సినిమాను చరిత్రలో జరిగిన కొన్ని యదార్థ ఘటనల నేపథ్యంతో తెరకెక్కిస్తున్నాం. ఆ అడ్వెంచర్ స్టోరీని రూపొందించడంలో హీరో విక్రమ్‌తో పాటు మూవీ టీమ్ నాకు ఎంతో సపోర్ట్ చేసింది.

## పూర్తి భిన్నమైన పాత్రలో నింద మూవీ



నటుడు వరుణం సందేశ్ వెల్లడి నా వ్యక్తిత్వానికి పూర్తి భిన్నమైన పాత్రతో రూపొందిన చిత్రమే 'నింద' అన్నారు కథానాయకుడు వరుణ్ సందేశ్. 'హ్యాపీడేస్'తో ప్రయాణం మొదలుపెట్టిన ఈయన... ప్రేమకథలతోనే ఎక్కువగా సందడి చేశారు. ఇప్పుడు కొత్త దారుల్లో ప్రయాణం చేస్తున్నారు. అందులో భాగంగా చేసిన సినిమానే 'నింద'. రాజేశ్ జగన్నాథం దర్శకనిర్మాణంలో రూపొందిన ఈ సినిమా ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకొస్తోంది. తనతో ఇలాంటి కథలే తీయాలని ముందే ఓ నిర్ణయానికొచ్చేవారు దర్శకనిర్మాతలు. అందుకు తగ్గట్టే ప్రేక్షకులు కూడా అమ్మాయిల వెంట తిరిగే ఓ లవర్‌బాయ్‌గానే ఊహించుకుని నా సినిమాకి వచ్చేవారు. ఎప్పుడూ అదే రకమైన పాత్రలు, కథల్లో నటిస్తూ నాకే అసంతృప్తిగా అనిపించేది. కొన్ని కథలేమో చెప్పినప్పుడు ఒకలాగా, తీరా తెరపైకి వచ్చినప్పుడు మరోలా అనిపించేవి. ఓ సినిమా చేస్తున్నప్పుడే 'అసలు నేనేం చేస్తున్నాను?' అని ప్రశ్నించుకుని, ఆ తర్వాత అమెరికా వెళ్లి ఏడాదిన్నర విరామం తీసుకుని తిరిగి వచ్చా. ఆ సమయంలోనే రాజేశ్ జగన్నాథం 'నింద' కథని చెప్పారు. నా గత సినిమాల ఛాయలు ఏమాత్రం కనిపించని ఈ కథ విన్న వెంటనే తెలియని ఉత్సాహం కలిగింది. స్వతహాగా నేను ఇష్టపడే కథలు ఈ తరహావే. కానీ ఎవ్వరూ చెప్పేవారు కాదు. ఇన్నాళ్లకు నాకు నచ్చిన ఓ కథ దొరికిందనే అనుభూతి కలిగిందని అన్నారు. సస్పెన్స్, థ్రిల్లింగ్ అంశాలతో కూడిన కథే ఇది. ఈ తరహా కథలతో ఇదివరకూ సినిమాలు వచ్చాయి. కానీ ఇందులో స్క్రీన్‌ప్లేనే చాలా కొత్తగా ఉంటుంది. అదే నాకు బాగా నచ్చింది.

## కాశ్మీర్‌లో మిస్టర్ బచ్చన్



దర్శకుడు హరీష్ శంకర్ తన మిత్రుడు రవితేజ కాంబినేషన్ లో 'మిష్టర్ బచ్చన్' సినిమా వస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా చిత్రీకరణ ఇప్పుడు చివరి దశకు చేరుకున్నట్టుగా కనపడుతోంది. కేవలం పాటలు మాత్రమే చిత్రీకరించాల్సి వున్న ఈ సినిమా, ఆ పాటల కోసం సినిమా యూనిట్ కాశ్మీర్ చేరుకున్నారు. అక్కడ అందమైన ప్రదేశాలలో హరీష్ శంకర్ పాటల చిత్రీకరణ చేయనున్నారు. తన సామాజిక మాధ్యమం అయిన 'ఎక్స్' లో హరీష్ శంకర్ ఈ చిత్రంపై కొన్ని పోస్టులు పెట్టారు. అందులో కాశ్మీర్ లో ఉన్నట్టు చూపించిన కొన్ని ప్రదేశాల బోర్డులను 'ఎక్స్' లో పోస్టు చేస్తూ చాలా ఉత్సాహంగా వున్నట్టుగా చెప్పారు. అలాగే తాను చిత్రీకరణ చెయ్యబోయే పాటలోని కొన్ని చరణాలను కూడా హరీష్ శంకర్ పోస్టు చేశారు.

సాహితి గారు రాసిన ఈ పాటని చిత్రీకరణ చెయ్యడానికి ఎంతో ఉత్తేజంగా వుంది అని చెప్పారు హరీష్ శంకర్. ఇంతకు ముందు సాహితి గారు తన సినిమాలకి రాసిన పాటలని కూడా గుర్తు చేశారు. 'గబ్బర్ సింగ్' సినిమాలో రాసిన కెవ్వు కేక.. పాట, అలాగే 'దువ్వాడ జగన్నాథం' సినిమాకి రాసిన అస్మైక యోగ... పాట అప్పట్లో పెద్ద విజయం సాధించిన విషయం తెలిసిందే. 'మిష్టర్ బచ్చన్' సినిమా నుండి షో రీల్ అని ఒక ప్రచార వీడియోని విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఒక్క మాట కూడా వినపడకుండా, కేవలం నేపథ్య సంగీతంతో వుండే ఆ వీడియోకి మంచి ప్రశంశలు వచ్చిన సంగతి తెలిసిందే. పరిశ్రమలో చాలామంది దర్శకులు, మిగతా వాళ్ళు ఆ షో రీల్ గురించి చాలా బాగా మాట్లాడటమే కాకుండా, హరీష్ ని ప్రశంశించారు కూడా. రవితేజ పక్కన భాగ్యశ్రీ బోర్సే అనే అమ్మాయిని తెలుగు తెరకి పరిచయం చేస్తున్నారు హరీష్ శంకర్. అజయ్ దేవగన్ నటించిన 'రైడ్' అనే సినిమాని హరీష్ శంకర్ 'మిస్టర్ బచ్చన్' గా తెరకెక్కిస్తున్నారు. హిందీలో సౌరభ్ శుక్ల చేసిన పాత్రని, తెలుగులో జగపతి బాబు చేస్తున్నారు, ప్రధాన విలన్ గా నటిస్తున్నారు.

## బుచ్చిబాబు దర్శకత్వంలో రామ్‌చరణ్

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో ఓ సినిమా రానున్న సంగతి తెలిసిందే. 'ఆర్‌సి16'గా ఇది ప్రచారంలో ఉంది. అధికారికంగా ఈ ప్రాజెక్ట్‌ను ప్రకటించి చాలా రోజులైంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్న ఈ చిత్రంపై దర్శకుడు తాజాగా ఓ అప్‌డేట్ ఇచ్చారు. హీరో విజయ్ సేతుపతి నటించిన 'మహారాజ' హిట్ టాక్‌ను సొంతం చేసుకున్న నేపథ్యంలో దర్శకుడు బుచ్చిబాబు ఆ చిత్రబృందాన్ని ఇంటర్వ్యూ చేశారు. ఈసందర్భంగా 'ఆర్‌సి16' గురించి విజయ్ మాట్లాడుతూ సినిమా స్టోరీ ఎంతో బాగుందని బుచ్చిబాబును ప్రశంసించారు. 'నాకు ఈ స్టోరీ మొత్తం తెలుసు. విడుదలకు ముందే చెబుతున్నాను ఇది సూపర్ హిట్ అవుతుంది.



## సప్త సాగరాలు దాటినా అవకాశాల్లేవా..?



ఎంత పెద్ద భారీ బడ్జెట్ సినిమా అయినా సరే.. తెర మీద ఎంత పెద్ద సూపర్ హీరోఉన్నా సరే తెర అందంగా కనిపించాలి అంటే అందమైన కథానాయిక ఉండాల్సిందే. అలాంటి కథానాయికలు ఎక్కడ ఉన్నా వారికి తగిన ఛాన్సులు వస్తాయి. కొందరు నటన ప్రాధాన్యత ఉన్న పాత్రలు చేస్తే కొందరు గ్లామర్ ని నమ్ముకుని అవకాశాలు అందుకుంటారు. ఎలా చేసినా ప్రేక్షకుల మనసు గెలవడమే హీరోయిన్స్ ముఖ్య ఉద్దేశం. ఈ క్రమంలో కొత్తగా వచ్చిన భామలు మనసులు గెలిచేస్తే వాళ్లను దేవతల్లా కొలుస్తుంటారు. ఈమధ్య కాలంలో అంతగా క్రేజ్ తెచ్చుకున్న వారిలో కన్నడ భామ రుక్మిణి వసంత్ ఉందని చెప్పొచ్చు. కన్నడలో అంతకుముందు 3 సినిమాలు, హిందీలో ఒక సినిమా చేసిన రుక్మిణి రక్షిత్ శెట్టి తో నటించిన సప్త సాగరాలు దాటి సినిమాతో సూపర్ పాపులర్ అయ్యింది. ఆ సినిమాలో ప్రియ పాత్రలో ఆమె నటించలేదు జీవించింది అంటే నమ్మాల్సిందే. ఆ సినిమా కేవలం కన్నడలోనే కాదు సౌత్ అన్ని భాషల్లో రిలీజ్ అవ్వడంతో అమ్మడికి సౌత్ ఆడియన్స్ అంతా కూడా ఫిదా అయ్యారు. ఈమధ్య కాలంలో హీరోయిన్ గురించి ప్రత్యేకంగా వెతికిన సందర్భాలు చాలా తక్కువ. కానీ సప్త సాగరాలు రెండు భాగాలు రిలీజ్ అయ్యాక రుక్మిణి వసంత్ గురించి బాగా వెతకడం మొదలు పెట్టారు. ఆడియన్స్ సప్త సాగరాలు సక్సెస్ తో ఆమె తెలుగు, తమిళ భాషల్లో వరుస ఆఫర్లు అందుకుంటుందని ఊహించారు. అయితే కోలీవుడ్ లో ఇప్పటికే రెండు సినిమాలు సైన్ చేసిన రుక్మిణికి తెలుగు నుంచి ఒక్క ఆఫర్ కూడా రాలేదు. టాలీవుడ్ నుంచి నిజంగానే ఆఫర్ రాలేదా లేదా వచ్చినా కూడా అమ్మడు చేయలేదా అన్నది తెలియదు కానీ ప్రస్తుతం కన్నడలో భగీరా, భైరథి రణగల్ సినిమాల్లో నటిస్తున్న రుక్మిణి తమిళంలో ఏస్ ఇంకా శివ కార్తికేయ 23వ సినిమాలో నటిస్తుంది.


## కల్కి విడుదలకు ముందే సర్‌ప్రైజ్‌లు

### అలనాటి నటి శోభన లుక్ విడుదల




'కల్కి' విడుదలకు ముందు సర్‌ప్రైజ్‌లు ఉంటాయని దర్శకుడు నాగ్‌అశ్విన్ గతంలో ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. విడుదల తేదీ దగ్గరపడుతుండడంతో ఒక్కో సర్‌ప్రైజ్‌ను రివీల్ చేస్తూ అభిమానుల్లో జోష్ నింపుతున్నారు. తాజాగా ఇందులో అలనాటి నటి శోభన ఉన్నట్లు తెలుపుతూ పోస్టర్ విడుదల చేశారు. ప్రభాస్ హీరోగా నాగ్‌అశ్విన్ తెరకెక్కిస్తున్న ఈ సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్‌లో ఇప్పటికే వివిధ భాషలకు చెందిన పలువురు అగ్ర నటీనటులు భాగమయ్యారు. ఇప్పుడు అలనాటి నటి శోభన కూడా ఈ ప్రాజెక్ట్‌లో ఉన్నారంటూ ఆమె లుక్‌ను విడుదల చేశారు. 'ఆమె పూర్వీకులు కూడా ఆమెలానే వేచి ఉన్నారు' అనే క్యాప్షన్‌ను జోడించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో 'కల్కి'లోని అతిథి పాత్రల గురించి చెప్పాలని నాగ్ అశ్విన్‌ను అడగ్గా 'వేచి ఉండండి' అని ఆయన నవ్వుతూ బదులిచ్చారు. ఇప్పుడు విడుదలకు మరో 8 రోజులే ఉండడంతో ప్రమోషన్‌లో భాగంగా ఒక్కో పాత్రను రివీల్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఒక్కప్పుడు అగ్ర హీరోల సరసన నటించి మెప్పించిన శోభన తెలుగులో చివరిసారి 2006లో వచ్చిన 'గేమ్'లో కనిపించారు. మళ్లీ 18 ఏళ్ల తర్వాత 'కల్కి 2898 ఏడీ' తో టాలీవుడ్‌కు రీ ఎంట్రీ ఇవ్వనుండడం విశేషం. తెలుగు రాష్ట్రాల్లోన్రూ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించనున్నారు. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన రానుందని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ చిత్రంలో ప్రభాస్ భైరవగా, అమితాబ్ బచ్చన్ అశ్వత్థామగా నటించారు. సీనియర్ హీరో కమల్‌హాసన్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. దిశా పటానీ రోక్సీ పాత్రతో అలరించనున్నారు.

## పొట్టి డ్రెస్సులో విష్ణుప్రియా మతిపోగొట్టే గ్లామర్



విష్ణు ప్రియ తెలుగు టెలివిజన్ పరిశ్రమలో ఎంతటి గుర్తింపు పొందిందో అందరికీ తెలిసిందే. అనసూయ, రష్మీ, శ్రీముఖిల తర్వాత, టీవీ షోలలో ఎక్కువగా కనిపించే యాంకర్ గా విష్ణు ప్రియ ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. "నెంబర్ వన్ యారి" ప్రోగ్రామ్ తో కెరీర్ ప్రారంభించిన విష్ణు ప్రియ, "పోవే పోరా" షో ద్వారా మరింత పాపులారిటీ సాధించింది. సుడిగాలి సుధీర్ తో కలిసి చేసిన ఈ షో ఆమెకు మంచి గుర్తింపు తీసుకువచ్చింది. సోషల్ మీడియా వేదికగా కూడా విష్ణు ప్రియ ఎంతో యాక్టివ్ గా ఉంటోంది. పక్కా తెలుగు అమ్మాయి అయినప్పటికీ, తన గ్లామర్ తో అభిమానులను ఆకట్టుకుంటోంది. ఇటీవల, తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఫోటోలు వైరల్ గా మారాయి. బ్లాక్ అండ్ వైట్ కాంబినేషన్లో ఉన్న డ్రెస్సులో విష్ణు ప్రియ అందాలను ఆరబోస్తూ ఫోజులు ఇచ్చింది. పొట్టి స్కర్ట్ లో అమ్మడు ఇచ్చిన స్టిల్ మామూలుగా లేదు. లెగ్స్ అందాలతో ఎద అందాలతో అమ్మడు మరింత డోస్ పెంచుతూ ఎంతగానో ఎట్రాక్ట్ చేస్తోంది. ఆమె వేసిన డ్రెస్, స్టైలింగ్, ఫోటోలు చూసి ఫ్యాన్స్ మంత్రముగ్ధులయ్యారు. కొన్ని కామెంట్ల ప్రకారం, "విష్ణు ప్రియ ఎలాంటి డ్రెస్ వేసినా ఆ డ్రెస్ కే అందం వస్తుంది" అని నెటిజన్లు పేర్కొన్నారు. విష్ణు ప్రియ గతంలో ఇంతకంటే ఘాటైన ఫోటోషూట్లను కూడా చేయగా, తాజా ఫోటోలు ప్రత్యేకంగా ఉన్నాయని అభిమానులు అంటున్నారు. టీవీ షోలలో ఇటీవల ఎక్కువగా కనిపించకపోయినా, ఆమె ఇతర కార్యక్రమాలలో, వెబ్ సిరీస్ లలో కనిపిస్తూ తన ప్రతిభను చాటుకుంటోంది. తాజాగా "దయా" వెబ్ సిరీస్ లో షబానా అనే పాత్రలో నటించిన విష్ణు ప్రియ, తన నటనతో మెప్పించింది. ఈ సిరీస్ హాట్ స్టార్ ఓటీటీ వేదికపై ప్రసారమవుతూ మంచి స్పందన పొందుతోంది. విష్ణు ప్రియ ప్రస్తుతం సినిమాల్లో అవకాశాలు దక్కించుకునే ప్రయత్నాల్లో ఉంది. ఆమె కెరీర్ లో కొత్త మలుపులు ఎలా ఉంటాయో, కొత్త ప్రాజెక్ట్ తో ప్రేక్షకులను ఎలా ఆకట్టుకుంటుందో చూడాలి. ఇటీవల ఒక లేడి ఓరియెంటెడ్ సినిమా చేస్తున్నట్లు వార్తలు వచ్చాయి కానీ వాటిపై ఇంకా క్లారిటీ ఇవ్వలేదు. ఏదేమైనా, విష్ణు ప్రియ తన టాలెంట్, అందంతో ప్రేక్షకులను మరింతగా ఆకర్షిస్తూ ముందుకు సాగుతోంది.